సాక్షి
అనకాపల్లి

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



హెచ్‌ఎస్‌ఎల్‌లో ఈఎన్‌సీ చీఫ్

విశాఖ: ఈస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ బుధవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించారు.



రైతు బిడ్డను ఆశీర్వదించండి

వలస వచ్చిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను చిత్తుగా ఓడించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పిలునిచ్చారు. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి	
ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
6.14	4.35
నర్సీపట్నం	
6.17	4.32



మా ఉసురు పోసుకోకండి

నా పేరు గొర్రుపోటు దేముడు. మాది కలిగొట్ల పంచాయతీ శివారు బండారుపాలెం. కలిగొట్లకి సుమారు మూడు కిలోమీటర్ల దూరం మా ఊరు. ఈ నెల పింఛన్ సొమ్ము పంచాయతీ ఆపీసుకాడ ఇత్తారని సెప్పారు. దీంతో తెల్లారగట్లే ఇంటికాడ బయల్దేరా. మూడు కిలోమీటర్లు కాలినడకనే వచ్చి, పంచాయతీ ఆపీసుకు చేరుకున్నా. తెల్లారి నుంచి మద్దేనం వరకు ఎండలోనే ఎదురుసూశా. మద్దేనం తిండి కూడా తిన్లేదు. నీళ్లు తాగి సరిపెట్టుకున్నా. కిందటి నెల వరకూ వోలంటీరే మా ఇంటికాడికొచ్చి పింఛన్ డబ్బులిచ్చేవోరు. ఇప్పుడు సెంద్రబాబు రాజకీయాలకు వోలంటీర్లను ఆపేశారు. మాలాంటోళ్ళి ఇలా ఎండల్లో తిప్పడం ఆళ్లకి నేయంగా ఉందా? ఓ పక్కన ఎండ, మరో పక్కన ఆకలి. అనుబవించోటోళ్లకే తెలుత్తాది ఆ కట్టం. **మాలాంటి ముసలోల్ని, కాళ్లూసేతుల, సూపాన్నోళ్లని ఇబ్బంది పెట్టి ఉసురు పోసుకోకండి.**



కొత్తరేవుపోలవరం సచివాలయం వద్ద వృద్ధుల నిరీక్షణ



సెంద్రబాబుకు నేయం కాదు

నాను జాజుల వరాలమ్మను. మాది అనకాపల్లి మండలం రేబాక. మా ఇంటాయన బతికున్నప్పటి నుంచి కల్లం దిబ్బలోనే పాకేసుకుని బతుకుతున్నా. ఇపుడాయన పోయారు. ఒక్కదాన్నే ఉంతన్నా. ఈ ఎండల్లో నడవలేకపోతన్నా. ఇపుడు మద్దేనం రెండయితంది కదా. సచివాలయంలో పింఛన్లిత్తన్నారని మావూరోల్లు సెప్తే ఎండలోనే ఊతకర్రట్టుకుని మెల్లిగా నడుసుకుంటూ ఎళ్తన్నా. నడిసి ఎల్లలేక ఎగపోత వత్తాంది. జగన్‌బాబు సీఎం అయ్యాక పెతి నెలా ఒకటో తేదీనే వొలంటీరు కల్లందిబ్బ కాదున్న మా పాక దగ్గిరికే వచ్చేవోరు. లెక్క తప్పకుండా ఒకటికి రెండుమార్లు నా కళ్ల దగ్గరగా డబ్బుల్ని ఉంచి మరీ లెక్కపెట్టి ఇచ్చేవోరు. ఈ నెలొచ్చి మూడు రోజులైనా ఇంకా పింఛన్ ఇవ్వనేదు. సచివాలయంకి ఎల్లడం నా వల్లగాదు. **మాలాటోల్ని తిప్పడం సెంద్రబాబుకు నేయం కాదు. వచ్చే నెలైనా వొలంటీరిచ్చేలా చేయాలి.**

మొదటి రోజు 30 శాతం పంపిణీ



అనకాపల్లి వేల్పులవీధి సూర్యారావు ఇంటి వద్ద పింఛన్ అందజేస్తున్న సచివాలయం అడ్మిన్

తుమ్మపాల: జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ జరిగింది. బ్యాంకుల నుంచి నగదు తీసుకువచ్చిన అనంతరం పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో మొత్తం 2,66,208మంది పింఛనుదార్లు ఉండగా, మొదటి రోజు రాత్రి 7 గంటల సమయానికి 72,290 మందికి సచివాలయాల ద్వారా పెన్షన్ల పంపిణీ జరిగింది. దాదాపు 30 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

పెన్షన్ కోసం వచ్చే లబ్ధిదారుల కోసం అధికారులు సచివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నీడ కోసం టెంట్లు, కుర్చీలతోపాటు మంచినీటి సౌకర్యం కల్పించారు. వికలాంగులు, అనారోగ్య బాధితులు, సైనిక్ వెల్ఫేర్ వితంతువులకు సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి పింఛను అందించాలని ఆదేశించారు. స్థానిక వేల్పులవీధి టౌన్ గరల్స్ హైస్కూల్ వద్ద దివ్యాంగుడు ముమ్మిన సూర్యారావు ఇంటికి సచివాలయం అడ్మిన్ వెళ్లి పింఛన్ అందించారు. సూర్యారావు మూడు సంవత్సరాలుగా రెండు కాళ్లు సరిగా పనిచేయక, నడవలేక ఇంటి వద్దనే ఉంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సచివాలయానికి వచ్చి తీసుకోలేని అవ్వ, తాతలకు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దనే పింఛన్ అందిస్తామని అధికారులు చెప్పారు.

అగచాట్లు.. అష్టకష్టాలు



మునగపాక సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



కశింకోటలో సచివాలయం వద్ద గుమిగూడిన పెన్షన్‌దారులు



పింఛన్ కోసం నర్సీపట్నం 17వ సచివాలయం వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

- పెన్షన్ కోసం మళ్లీ పండుటాకుల పడిగాపులు
- ఒంట్లో ఓపిక లేకున్నా ఎండలో పడుతూ లేస్తూ అడుగులు
- బాబు రోజులను గుర్తుకు తెచ్చుకున్న పింఛనుదార్లు
- ఆయన వల్లే తమకీ దుస్థితి అంటూ దూషణలు

సాక్షి, విశాఖపట్నం: వృద్ధాప్యం ఇబ్బంది పెడుతున్నా, అంగ వైకల్యం బాధిస్తున్నా, మంచం మీద నుంచి లేవలేకున్నా, ఒంట్లో ఓపిక లేకున్నా, అనారోగ్యం పీడిస్తున్నా టీడీపీ హయాంలో ఇచ్చే రూ.వెయ్యి పెన్షను కోసం కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ ఆఫీసులకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ గంటల తరబడి నిలబడాల్సి వచ్చేది. తమతో మరొకరిని వెంట బెట్టుకుని వెళ్లేవారు. దీంతో సాయం వెళ్లే వ్యక్తి ఆ రోజు కూలీ సొమ్మును కోల్పోయేవారు. ఇలా ఒకసారి కాదు.. పలుమార్లు తిరిగితేనే తప్ప ఇచ్చే ఆ అరకొర పింఛను సొమ్ము చేతికొచ్చేది కాదు. ఇదంతా ఐదేళ్లకు ముందు చంద్రబాబు పాలనలో పరిస్థితి. 2019లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ పరిస్థితి సమూలంగా మారిపోయింది. నెలనెలా ఒకటో తేదీనే తెల్లారకుండానే పింఛనుదార్ల ఇంటికే పెన్షను సొమ్మును చేతిలో పెట్టే వ్యవస్థ వచ్చింది. ఇక అప్పట్నుంచి వీరి కష్టాలకు ఫుల్‌స్టాప్ పడింది. ప్రతి నెలా పింఛను సొమ్ము కోసం ఎదురు చూసే పరిస్థితి, కాళ్లీడ్చుకుంటూ దూరంగా వెళ్లాల్సిన దుస్థితి తప్పింది. ఒకటో తేదీ వచ్చిందంటే పండుటాకులకు పండుగలా మారింది. ఒక రోజు ముందు నుంచి ముసిముసి నవ్వులతో వలంటీరు తలుపు తట్టే సమయం కోసం ఆశగా చూసే రోజులొచ్చాయి. అలా హాయిగా, ఆనందంగా గడుపుతున్న వీరిపై చంద్రబాబు బ్యాచ్‌కు కన్నుకుట్టింది. వారి సంతోషాన్ని తుంచేయాలన్న కోరిక పుట్టింది. ప్రతి నెలా ఇంటికి పెన్షను సొమ్ము తెచ్చిచ్చే వలంటీర్లను అడ్డు తొలగిస్తే తమ లక్ష్యం నెరవేరుతుందన్న దురుద్దేశంతో ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదులు చేయించి తాను అనుకున్నది సాధించగలిగారు. బాబు పుణ్యమాని ఇప్పుడు వారికి ఒకటో తేదీనే పెన్షను ఇంటికి వచ్చి ఇచ్చే వీల్లేకుండా పోవడమే కాదు.. మళ్లీ తన హయాంలో మాదిరిగా సచివాలయాలకు మండుటెండల్లో మలమల మాడుతూ, పడుతూ, లేస్తూ వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. చంద్రబాబు కల్పించిన ఈ అవస్థలతో పింఛనుదార్లు మళ్లీ ఆయన హయాం నాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటున్నారు. ఆయన వల్లే తమకీ కష్టాలంటూ దూషిస్తూ, శాపనార్థాలు పెడుతున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే తమకు ఈ తిప్పలు తప్పుతాయని తెగేసి చెబుతున్నారు.

ఆత్రంగా అడుగులు.. ఆపై పడిగాపులు..

వాస్తవానికి ప్రతినెల మాదిరిగానే ఈనెల కూడా పెన్షను సొమ్ము ఇంటికే వచ్చి ఇస్తారని ఆశించిన పింఛనుదార్లు సచివాలయాలకెళ్లి తీసుకోవాలన్న చేదు నిజాన్ని ఆలస్యంగా తెలుసుకున్నారు. బుధవారం నుంచి పెన్షన్ల పంపిణీ జరుగుతుందన్న సమాచారంతో ఉదయం నుంచే ఓపిక కూడగట్టుకుని, అవస్థలు పడుతూ సచివాలయాలకు క్యూ కట్టారు. ప్రధానంగా అల్లూరి జిల్లాలో కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు ఎండలో నడుచుకుంటూ వెళ్లారు.

ఇటు విశాఖ నగరంలోను, జిల్లాలోను, అనకాపల్లి జిల్లాలోనూ పలుచోట్ల మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసి మధ్యాహ్నం తర్వాత సిబ్బంది పంపిణీ మొదలు పెట్టి సాయంత్రం పొద్దుపోయే వరకు ఇస్తూనే ఉన్నారు. మిగిలిన వారికి ఆరో తేదీ సాయంత్రం వరకు ఇవ్వనున్నారు. 'మండుటెండల దృష్ట్యా ప్రభుత్వాదేశాల మేరకు సచివాలయం వద్ద షామియానాలు, వాటర్ క్యాన్లను ఏర్పాటు చేశాం. పెన్షను కోసం వస్తున్న పింఛనుదార్లకు సొమ్ము పంపిణీ చేస్తున్నాం. మంచాన పడిన వారికి వాళ్ల ఇంటికే తీసుకెళ్లి ఇస్తున్నాం' అని అధికారులు తెలిపారు.



అంధుడి అవస్థ

కశింకోట : స్థానిక కనకమహాలక్ష్మి వీధికి చెందిన భీమరశెట్టి నూకరాజు అంధుడు. పొరుగు వారి సహాయంతో సచివాలయానికి వచ్చారు. పింఛన్ సొమ్ము అందుకున్నారు. తమలాంటి వారికి ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తామని చెప్పారని, అయితే ఆలస్యం అవుతుందని, అవసరాల కోసం కష్టమైనా వచ్చి పింఛన్ తీసుకోవలసి వచ్చిందని నూకరాజు పేర్కొన్నారు.

కశింకోటలో పింఛన్ పొందుతున్న అంధుడు భీమరశెట్టి నూకరాజు



బుచ్చెయ్యపేటలో పింఛన్ల పంపిణీ



వృద్ధురాలి అవస్థ



పింఛన్ కోసం మునగపాక సచివాలయానికి వచ్చిన దివ్యాంగుడు

పింఛనుకు వెళ్తూ మృత్యువాత..

మండుటెండలో పెన్షను కోసం సచివాలయాలకు వెళ్తూ వడ దెబ్బకు గురై వృద్ధులు మృత్యువాత పడుతున్నారు. ఇలా బుధవారం అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆనందపురం వికలాంగుడు రాజబాబు, అల్లూరి జిల్లా అనంతగిరి మండలం వేలమామిడికి చెందిన పాడి సోములు మృతి చెందారు.

పింఛన్‌లో రూ.60 చార్జీలకే పోయాయి



మండుటెండలో సచివాలయానికి వచ్చి వృద్ధాప్య పింఛన్ తీసుకున్నా. ప్రతీనెల ఒకటో తేదీన తెల్లవారక ముందే వలంటీర్ ఇంటి తలుపు తట్టి పింఛన్ అందించే వారు. ఈ నెల పింఛన్ తీసుకోడానికి రవాణా ఖర్చులు రూ.60 అయ్యాయి. నా కొడుకు, కోడలు సాయపడితేగానీ సచివాలయానికి రాలేకపోయా. నా కోసం వారు పనులు మానుకోవాల్సి వచ్చింది. మళ్లీ పాత పద్ధతులే వచ్చాయని భయం వేస్తోంది. వలంటీర్ల ద్వారా ఇంటికే వచ్చి పింఛన్లు అందించాలి.

– కె.కమలమ్మ, పెద్దవీధి, అనకాపల్లి

మళ్లీ పడిగాపులు కాయాలా?



దివ్యాంగుడినైన నేను మరో మనిషి సాయం ఉంటే తప్ప అడుగు బయటకు వేయలేని పరిస్థితి. ఇప్పటి వరకు మాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వలంటీర్లు ఇంటి దగ్గరే పింఛన్ సొమ్ము అందించారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయకూడదని ఫిర్యాదులు చేసి, మాలాంటి వారిని ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సబబు. ఉదయం నుంచి సచివాలయం వద్ద పడిగాపులు కాసి నానా ఇబ్బందులు పడ్డాం. చాలా సేపు లైన్లో వెయిట్ చేసి పెన్షన్ తీసుకున్నా.

–సబ్బవరపు ఎర్రినాయుడు, దివ్యాంగుడు, దేవరాపల్లి

పారదర్శకంగా ఎన్నికల ముందస్తు ప్రక్రియ



- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపులతో సహా ఎన్నికల ముందస్తు ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే వారం ఎన్నికల సిబ్బంది మొదటి రాండమైజేషన్ చేస్తున్నట్టు తెలిపారు. వేయి మందిలోపు ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రానికి ఒక పీవో, నలుగురు అధికారులు, వేయికి మించితే పీవో, ఐదు గురు అధికారులు ఉంటారని చెప్పారు. జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు ప్రతి కేంద్రంలో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు, పార్లమెంట్‌కు సంబంధించిన 7 (పెందుర్తితో కలిపి) నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అనకాపల్లిలోనే జరుగుతాయని వివరించారు. సి-విజిల్, ఆర్వోలకు వచ్చిన ఫిర్యాదులు, దినపత్రికల్లో వచ్చిన వార్తలకు సంబంధించి ఫిర్యాదులను వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో పింఛన్ల పంపిణీ జరుగుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఐ.ఆర్.గంగాధర్, రుత్తల శంకరరావు, కొణతాల హరనాథబాబు, పి.నాగేశ్వరరావు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి పి.ప్రసాద్, ఆడిట్‌ఆఫీసర్ గోవిందరాజులు, పశుసంవర్ధకశాఖ ఏడీ ప్రసాదరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.ఎస్.కుమార్, ఎన్నికలవిభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, డీటీ రవికుమార్, ఎస్.ఎ. తులసీ రామ్ పాల్గొన్నారు.



ఢిల్లీ అభిమానుల కేరింతలు





బౌండరీ లైన్ వద్ద బంతిని అడ్డుకుంటున్న వార్నర్



అభిమానుల ఉత్సాహం



కేకేఆర్.. హుషార్



రస్సెల్

ఫోర్లు, సిక్సర్ల మోతతో కోల్‌కతా నైట్‌రైటర్స్ బ్యాటర్లు విశాఖలో పరుగుల సునామీని సృష్టించి.. అభిమానుల్లో కావాల్సినంత జోష్‌ను నింపారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లను ఊచకోత కోసి ఐపీఎల్ చరిత్రలోనే రెండో అత్యధిక స్కోర్ సాధించారు. ఇక్కడి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బంతులు బౌండరీలు దాటుతుంటే.. కేకేఆర్ అభిమానులు కేరింతలు కొడుతూ ప్రతీ బంతిని ఆస్వాదించారు. హోం జట్టుగా బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులతోపాటు కోల్‌కతా నైట్ రైడర్స్ అభిమానులతో స్టేడియం నిండిపోయింది. కేరింతలు కొడుతూ ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. కేకేఆర్ బ్యాటర్లు సునీల్ నరైన్, రఘువంశీ, ఆండ్రీ రస్సెల్ 'రన్'రంగం సృష్టించగా.. డీసీ తరఫున రిషభ్ పంత్, ట్రిస్టన్ స్టబ్స్ మెరుపులు మెరిపించారు. అయితే భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ కాపిటల్స్‌పై చతికిలపడి ఓటమి పాలైంది. ఈ సీజన్‌లో విశాఖ క్రికెట్ అభిమానులకు డీసీ, సీఎస్‌కే, కేకేఆర్ జట్లు మంచి అనుభూతిని పంచాయి.

– విశాఖ స్పోర్ట్స్

- విశాఖ క్రీడాభిమానులు సీఎస్‌కే జరిగిన మ్యాచ్‌కు టాస్‌కు గంటముందే స్టేడియంలోకి చేరుకున్నారు. ఈ సారి అంత జోష్ కనిపించలేదు. మెల్లమెల్లగా క్రీడాభిమానులు రావడంతో మొత్తానికి గ్యాలరీలు నిండాయి.
- స్థానిక ఆటగాళ్లు రికీబుయ్(డీసీ), కె.ఎస్.భరత్(కేకేఆర్) బెంచ్‌కే పరిమితమయ్యారు.
- కోల్‌కతా నైట్‌రైడర్స్ అధినేత షారుఖ్ ఖాన్ స్టేడియం డకౌట్‌లో సందడి చేశారు. జట్టు ఆటగాళ్లు సిక్సర్లు, ఫోర్ల మోత మోగిస్తుంటే.. చప్పట్లతో వారిని ప్రోత్సహించారు.
- ఢిల్లీ క్యాపిటల్స్ యజమాని పార్థ్ జిందాల్ మ్యాచ్‌కు హాజరయ్యారు.

క్లుప్తంగా

6న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈనెల 6వ తేదీ ఉదయం 10గంటలకు రింగ్‌రోడ్ రహదారి పెంటకోట కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, ఎమ్మెల్యే అభ్యర్థులు కరణం ధర్మశ్రీ, మలసాల భరత్‌కుమార్, కన్నబాబురాజు, అదీప్‌రాజు, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, ఈర్లె అనూరాధ హాజరుకానున్నట్టు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ముఖ్య నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

యర్రాపాత్రుడిని కలిసిన బూడి, ఎమ్మెల్యే గణేష్



యర్రాపాత్రుడిని సత్కరిస్తున్న బూడి, ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం : మండలంలో సీనియర్ నేత అయిన రుత్తల యర్రాపాత్రుడు(బాబులు)ను డిప్యూటీ సీఎం, అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి యర్రాపాత్రుడితో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయ సన్యాసిపాత్రుడు, ఆల్ ఇండియా ఓబీసీ అధ్యక్షులు పోతల ప్రసాద్‌నాయుడు, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భద్రాచలం, పార్టీ నేతలు హరిబాబు, బాల, బొడ్డు గోవింద పాల్గొన్నారు.

రైతు బిడ్డను ఆశీర్వదించండి

- వలస పక్షి సీఎం రమేష్‌ను చిత్తుగా ఓడించండి
- ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

నర్సీపట్నం : ఈ ఎన్నికల్లో రైతు బిడ్డనైన తనను ఆశీర్వదించి..వలస వచ్చిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను చిత్తుగా ఓడించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో ముత్యాలనాయుడు పాల్గొని, పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన తాను వార్డు మెంబరు నుంచి పార్లమెంట్‌కు పోటీ చేసే స్థాయికి ఎదిగానన్నారు. తన తండ్రి తారువా గ్రామ సర్పంచ్‌గా 24 ఏళ్ల సేవలు అందించారన్నారు. తన రాజకీయ ప్రస్థానం వార్డు మెంబర్ నుంచి సర్పంచ్, ఎంపీటీసీగా, ఎంపీపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగానని, తనను ఈ స్థాయిలో నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. తాను స్థానికుడిని నిరంతరం మీకు అందుబాటులో ఉంటానని, ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా ఉమాశంకర్ గణేష్‌ను గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని అన్నారు. గతంలో అనకాపల్లి పార్లమెంట్ ఎంపీలుగా పోటీ చేసిన స్థానికేతరులైన నూకారపు సూర్యప్రకాష్, అల్లు అరవింద్‌ను ప్రజలు చిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కూడా స్థానికేతరుడైన సీఎం రమేష్‌ను ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ సమర్థుడైన నాయకుడని కొనియాడారు. ఎమ్మెల్యే గణేష్ కృషి వల్లనే నియోజకవర్గానికి మెడికల్ కళాశాల సాధ్యమైందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గం నుంచి 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడ్డాయన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాలనాయుడును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ సీఎం రమేష్ పెద్ద ఆర్థిక నేరగాడు అని, ఆయనపై అనేక కేసులున్నాయని అన్నారు. స్థానికుడిని కాదని..ఎక్కడో కడప నుంచి వచ్చిన వ్యక్తికి ఓటు ఎలా వేస్తామన్నారు. మన ప్రాంత వ్యక్తి అయిన ముత్యాలనాయుడును ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా బీసీ అసోసియేషన్ జ్యోతిబాపూలే జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలోని బీసీ కులాలు స్థానికుడైన ముత్యాలనాయుడుకే మద్దతు తెలుపుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సీనియర్ నాయకులు బోళెం నర్సింహమూర్తి, డాక్టర్ లక్ష్మీకాంత్, ఎంపీపీలు రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్‌మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణచ ముస్లిం కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ షేక్ ఉన్నీషాబేగం మాట్లాడారు. అనంతరం ముత్యాలనాయుడుకు ఎమ్మెల్యే జ్ఞాపిక అందజేసి సాలువతో సత్కరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు,ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఏకా శివ, సిహెచ్.వరుణ్ పాల్గొన్నారు.



ముత్యాలనాయుడుని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

పది పంచాయతీల వలంటీర్లు రాజీనామా



మాకవరపాలెం ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

మాకవరపాలెం : వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు మండలంలోని బూరుగుపాలెం, గిడుతూరు, చామంతిపురం, తూటిపాల, మామిడిపాలెం, మునిడిపాలెం, పాపయ్యపాలెం, పి.తూటిపాలతో సహా పది పంచాయతీల వలంటీర్లు బుధవారం సాయంత్రం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో చంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ ప్రజలకు తాము అందిస్తున్న సేవలను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో నిష్పక్షపాతంగా వ్యవహరించామని, వీటిని తట్టుకోలేక ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడమేగాక, తమను మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు తామంతా కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన వారిలో పాపయ్యపాలెం, పైడిపాల, బూరుగుపాలెం, గిడుతూరు, తూటిపాల సచివాలయాల పరిధిలోని 50 మంది వలంటీర్లు ఉన్నారు.

శ్రీరాంపురంలో 14 మంది రాజీనామా

పాయకరావుపేట : శ్రీరాంపురం గ్రామంలో 14 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ విధులకు రాజీనామా చేసారు. ప్రతి ఒక్కరూ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు సమర్పిస్తున్నట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు సమక్షంలో గ్రామ వలంటీర్లు మాట్లాడుతూ టీడీపీ నాయకులు చంద్రబాబు కుట్రలు కారణంగా తమ విధులకు ఎన్నికల సంఘం ఆటంకం కల్పించడం జరిగిందని, ఆవేదన వ్యక్తం చేశారు. ఇక పై తాము స్వచ్ఛందంగా ప్రభుత్వం విడుదల చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోనికి తీసుకెళ్ళి, మే 13 న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని విజయపథంలో గెలిపించుకోవడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.



వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు సమక్షంలో రాజీనామా పత్రాలతో గ్రామ వలంటీర్లు

జగన్ పాలనకు జనం మద్దతు...అందుకే చంద్రబాబు అక్కసు

అనకాపల్లి : వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ప్రభుత్వ పింఛను అందజేస్తున్న వలంటీర్లపై కక్షతో చంద్రబాబు నాయుడు కోవర్ట్ అయిన నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్‌ల సేవలను నిలుపుదల చేయించారని అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక రింగు రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు కూటమి కక్ష పెట్టుకుని కుట్రలకు పాల్పడుతోందన్నారు. అయితే త్వరలోనే ముఖ్యమంత్రిగా మరోసారి జగన్ మోహన్‌రెడ్డి గెలుపు ఖాయం అని అన్నారు. కశింకోట మండలంలో 250 మంది స్వచ్ఛందంగా వలంటీర్ విధులకు రాజీనామా చేసినట్టు తెలిపారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ మరో వారం రోజుల్లో 2024 ఎన్నికల మేనిఫెస్టోను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా విడుదల చేయనున్నారని, 2019 ఎన్నికల్లో విడుదల చేసిన మేనిఫెస్టోను 99 శాతం అమలు చేయడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 175 స్థానాల్లో 175 ఎమ్మెల్యే అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, అనకాపల్లి ఎంపీపీ సూరిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, ఏపిడబ్ల్యూఏ చైర్మన్ దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కలగా గున్నయ్యనాయుడు, బియ్యపు బూలోక నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్. వేదికపై ఎంపీ సత్యవతి తదితరులు

కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లా పనిచేయాలి

పాయకరావుపేట: త్వరలో జరగనున్న ఎన్నికల్లో పార్టీ కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం కన్వీనర్లు, గృహసారథులు పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో మే 13 న జరిగే ఎన్నికల్లో మనందరం కూడా సైనికుల్లా పని చేసి వైఎస్సార్‌కాంగ్రెసు పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించే విధంగా పాటుపడాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు, గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజల హృదయాల్లో నాటుకుపోయాయని అన్నారు. దీంతో అక్కసు పెంచుకున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు కలిసి కుటిల రాజకీయం చేస్తున్నారన్నారు. గ్రామ వలంటీర్లను విధులకు దూరం చేయడంతో పింఛన్లు అందక రాష్ట్రంలో వృద్ధులు ఎన్నో అవస్థలకు గురవుతున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని స్వార్థ రాజకీయాలు చేసినా రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల హామీల్లో 95 శాతం నేరవేర్చిన ఘనత, 85 శాతం పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బూత్ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరును కలిసి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించి పాయకరావుపేట నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కంబాల జోగులు భారీ మెజార్టీ సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు కాధా రామకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు నెలపర్తి అర్జున్, గ్రామ పంచాయతీ సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, బీసీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

పవన్ కల్యాణ్ యాత్ర వాయిదా

- తొలి ఎన్నికల ప్రచారానికి బ్రేక్

సాక్షి, విశాఖపట్నం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటన వాయిదా పడింది. ముందుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈనెల 5, 6, 7 తేదీల్లో జరుగుతుందని పార్టీ ప్రకటించింది. 5న అనకాపల్లి, 6న యలమంచిలి, 7న పెందుర్తి ఎన్నికల సభల్లో పవన్ పాల్గొంటారని పేర్కొంది. అయితే కాకినాడ జిల్లా ఎన్నికల పర్యటనలో ఉన్న ఆయనకు జ్వరం సోకడంతో తొలుత ప్రకటించిన ప్రాంతాల్లో వారాహి యాత్ర రద్దయిందని జనసేన నాయకులు తెలిపారు. కాగా ఎన్నికల షెడ్యూలు ప్రకటించాక పవన్ కల్యాణ్ చేపట్టబోయే తొలి ఎన్నికల ప్రచార యాత్ర కోసం ఆ పార్టీ శ్రేణులు కొన్నాళ్లుగా హడావుడి చేస్తున్నారు. అనూహ్యంగా పవన్ సభలు రద్దు కావడంతో వీరు డీలా పడ్డారు. పవన్ ఈ మూడు ప్రాంతాల్లో మళ్లీ ఎప్పుడు పర్యటిస్తారన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. జ్వరం నుంచి కోలుకున్నాక త్వరలోనే ఆయన ప్రచార యాత్ర తేదీలను ప్రకటిస్తారని జనసేన నాయకులు చెబుతున్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎన్నికల సంఘం అధికారి కేశప్రగడ వెంకట నరసింహమూర్తి తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే ఎన్నికలకు 70 మంది న్యాయవాదులు సేవలందిస్తున్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలిసారిగా ఎన్నికల నియమావళి, నిర్వహించే విధానాన్ని అభ్యర్థులకు వివరించారు. వివిధ పదవులకు 49 మంది పోటీలో ఉన్నారు. ఇప్పటికే ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఐదుగురు సీనియర్ న్యాయవాదులు సహాయ ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ పదవులు ఆశిస్తున్న అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, జూనియర్ సీనియర్ సభ్యులు, గ్రంధాలయ, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి పదవులకు ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. కోర్టుకు రాలేని సీనియర్ న్యాయవాదులకు ఇంటి వద్ద ఓటు వేసే విధంగా పలువురు న్యాయవాదుల కమిషనర్లను నియమించారు.

స్టీల్‌ప్లాంట్‌కు నూతన డైరెక్టర్ల నియామకం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్లు (కమర్షియల్)గా ఘంటసాల వెంకట నాగాంబిక ప్రసాద్, చలువాడి శ్రీరామ వెంకట గోపాలకృష్ణ గణేష్ (ఫైనాన్స్) నియమితులయ్యారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆ పోస్టుకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆ ఇంటర్వ్యూలో స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్ విభాగం జీఎం నాగాంబిక ప్రసాద్‌ను ఎంపిక చేశారు. అదే విధంగా స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్)గా విధులు నిర్వహించిన వీవీ వేణుగోపాలరావు గత ఏడాది పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో ప్రస్తుతం డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆ స్థానానికి జరిగిన ఇంటర్వ్యూలో స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ విభాగం జీఎం గోపాలకృష్ణ గణేష్ ఎంపిక చేశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ నుంచి ఇద్దరు డైరెక్టర్ల నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సీఎండీ అతుల్ భట్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 24 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. సుంకరమెట్ట జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలో కప్పాక గ్రామానికి చెందిన ఎస్.ఈశ్వరరావు వద్ద నుంచి 14 బాటిళ్లు, మండలంలో గొలగాం గ్రామానికి చెందిన పి.అప్పారావు నుంచి 10 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

మునగపాక : విద్యుత్ షాక్‌కు గురై మునగపాకకు చెందిన వ్యవసాయ రైతు దాడి వెంకట్(59) బుధవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. మునగపాకకు చెందిన దాడి వెంకట్ వ్యవసాయం సాగు చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం బెల్లం తయారు చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతనిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందారు. మృతుడు వెంకట్‌కు భార్య, ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వెంకట్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న అప్పన్న వార్షిక కల్యాణం

- మే 10న చందనోత్సవం
- సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి
- ఏర్పాట్లపై ముందస్తు పరిశీలన

సింహాచలం : చైత్రశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 19న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం, వైశాఖ శుద్ధ తదియని పురస్కరించుకుని మే 10న చందనోత్సవం నిర్వహించనున్నామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఆయా ఉత్సవాలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై ముందస్తుగా ఆలయ అధికార, వైదిక వర్గాలతో పలు అంశాలపై ఈవో బుధవారం చర్చించారు. సింహగిరిపై పర్యటించి ఏ విధంగా దర్శనాల క్యూలు ఏర్పాటు చేయాలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈ నెల 9న ఉగాదిని పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం సింహగిరిపై పెళ్లిరాట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 19న స్వామివారి వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆ రోజు రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం, రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం ప్రారంభమవుతాయని తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామన్నారు. అలాగే మే 10న స్వామి వారి చందనోత్సవం నిర్వహణకు ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. గత చందోత్సవంలో జరిగిన లోటుపాట్లపై, భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై, దర్శనాలపై సుదీర్ఘంగా చర్చించారు. వైదిక వర్గాల నుంచి పలు సలహాలు స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.



క్యూ లైన్ ఏర్పాటును పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

మత్స్యకారులు.. మృత్యుంజయులు

- సురక్షితంగా ఒడ్డుకు చేరిన ఆరుగురు గంగపుత్రులు
- ఊపిరి పీల్చుకున్న వారి కుటుంబ సభ్యులు
- పరామర్శించిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి



మత్స్యకారులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్, డీసీసీబీ అధ్యక్షుడు కోలా గురువులు, ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట: నడిసంద్రం.. చుట్టూ చీకటి.. బలంగా వీచిన గాలికి బోల్తా పడిన బోటు.. సముద్రంలో పడిపోయిన ఆరుగురు మత్స్యకారులు.. ఒకవైపు ఆకలి, దాహం.. మరో వైపు మృత్యువుతో పోరాడి ఎలాగైనా ఒడ్డుకు చేరుకోవాలన్న దృఢ సంకల్పం.. ఒకటి కాదు.. రెండు కాదు.. 24 గంటలకుపైగా కెరటాలకు ఎదురొడ్డి.. సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. వారి కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యుల్లో ఆనందం నింపారు. రోజు మాదిరిగానే గంగమ్మ తల్లికి మొక్కుకుని కారి చిన్నారావు, వాసుపల్లి అప్పన్న, కారి చిన్న సత్తయ్య, కారి నరేంద్ర, వాసుపల్లి అప్పన్న, మైలపల్లి మహేష్ సోమవారం మధ్యాహ్నం విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి ఐఎన్‌డీ-ఏపీ-వీ1-ఎంవో-2736 నంబర్ బోటుపై వేటకు బయలుదేరారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముక్కం గ్రామానికి చెందిన వీరంతా హార్బర్ సమీపంలో జాలరిపేటలో నివాసం ఉంటున్నారు. కాగా.. రాత్రి 10 గంటల సమయంలో బోటు యాజమాని శ్రీనివాసరావు వారితో ఫోన్‌లో మాట్లాడారు. సముద్రంలో అలల తాకిడి ఉధృతంగా ఉందని మత్స్యకారులు బోటు యాజమానికి వివరించారు. 11 గంటలకు ఫోన్ చేస్తే వారి ఫోన్లు స్విచ్ఛాఫ్‌గా వచ్చాయి. తరువాత ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. మంగళవారం తిరిగి చేరుకోవాల్సి ఉన్నా.. రాలేదు. కుటుంబ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కోస్ట్‌గార్డ్ అప్రమత్తమైంది. నేవీ హెలికాప్టర్లు రంగంలోకి దిగాయి. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆ మత్స్యకారుల కుటుంబాల్లో ఆందోళన మరింత పెరిగింది. ఎట్టకేలకు బుధవారం మత్స్యకారులంతా సురక్షితంగా అప్పికొండ తీరానికి చేరుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అక్కడ నుంచి ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి వచ్చారు. మీడియాతో మాట్లాడారు.

మృత్యువుతో పోరాడం

'సముద్రం మధ్యలో గంగవరం వైపు వేట సాగిస్తున్నాం. రాత్రి అయింది. ఒక్కసారిగా భారీ గాలి రావడంతో కెరటం ఎగసిపడి బోటును తిరగేసింది. బోటుపై ఉన్న ఆరుగురం సముద్రంలో పడిపోయాం. బోటులో ఉన్న సామగ్రి అంతా మునిగిపోయింది. సెల్‌ఫోన్లు నీటిలో పడిపోయాయి. అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని గంగమ్మ తల్లికి దండం పెట్టుకుని ఈత కొట్టడం ప్రారంభించాం. భారీ అలలతో ఉక్కిరిబిక్కిరి అయినప్పటికీ ధైర్యం కోల్పోకుండా.. ఒకరికొకరు సహకరించుకున్నాం. బోటు ఫైబర్ ది కావడంతో నీటిపై తేలి యాడుతూ ఉంది. కొంత సేపు బోటు మీద.. మరికొంత సేపు ఈత కొట్టడం, అలసట వస్తే బోటు మీద ఎక్కి కూర్చోడం ఇలా రాత్రంతా సాగింది. గంటలు గడుస్తున్నాయి గానీ.. ఒడ్డు కనిపించలేదు. గాలి తీవ్రతకు బోటు ఇంకా లోపలికి వెళ్లిపోయింది. దీంతో ఆందోళన మరింత ఎక్కువైంది. రాత్రంతా సముద్రంలోనే గడిపాం. తెల్లారింది.. అయినా ఒడ్డుకు వచ్చే పరిస్థితి కనిపించలేదు. గంటలు గడుస్తున్నాయి.. ఆకలి దాహం.. ఎండ కూడా మొదలైంది. దీంతో నడిసముద్రంలో బిక్కు బిక్కు మంటూ గడిపాం. ఎలాగైనా ఒడ్డుకు చేరాలన్న ఆశయంతో ఈత కొట్టాం. ఆ సమయంలో చుట్టు పక్కల ఎలాంటి బోట్లు కనిపించలేదు. చివరకు బోటును సముద్రంలో వదిలి ఈత కొట్టుకుంటూ బుధవారం తెల్లవారేసరికి అప్పికొండ తీరానికి చేరాం. అక్కడి మత్స్యకారులు బోటు యాజమానికి, మా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.' అని బాధిత మత్స్యకారులు వివరించారు. వీరిలో నలుగురికి దెబ్బలు తగలడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ అధ్యక్షుడు కోలా గురువులు, ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తదితరులు పరామర్శించారు.

క్లుప్తంగా

పాలిసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

కశింకోట: స్థానిక ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు పాలిసెట్‌లో ఉచిత శిక్షణ కొనసాగుతోందని ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్‌ను, శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని అభిలషించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు గణేష్, రమణకుమార్, శివరాం, జగన్మోహిని, వీరేంద్ర జగదీష్, జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇండియా కూటమి గెలిస్తేనే దేశ పురోగతి'



ఇండియా కూటమి అభ్యర్థి గంగాధర్‌తో వామపక్ష పార్టీల నాయకులు

అనకాపల్లి: ఇండియా కూటమి విజయంతోనే దేశ పురోగతి ఆధారపడి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీ కాంగ్రెస్ శాసనసభ అభ్యర్థి ఐఆర్ గంగాధర్, సీపీఎం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ మతోన్మాద బీజేపీ, దాని వంత పాడుతున్న భాగస్వామ్య పార్టీలను ఓడించేందుకు ఇండియా కూటమి పనిచేస్తుందన్నారు. ఇండియా కూటమి అభ్యర్థి గంగాధర్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. సమావేశంలో అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్, కశింకోట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సునేడ గజ్జాలు, కొల్లి సత్యారావు, సీఐటీయూ నాయకుడు రుత్తల శంకర్‌రావు, అనకాపల్లి సీపీఎం నాయకుడు గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

5న జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

అనకాపల్లి: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను ఈ నెల 5న స్థానిక చోడవరం బస్టాప్ వద్ద నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు కట్టమూరి మంగరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, మరియు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. స్థానిక ఎమ్మార్పీస్ నాయకులంతా హాజరు కావాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	:	సత్యనారాయణస్క్రీన్-1
టిల్లు స్క్వేర్	:	సత్యనారాయణస్క్రీన్-2
ఓం భీం బుష్	:	షిర్డిసాయి
గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ (తెలుగు 3డి)	:	పర్తిసాయి
ది గోట్ లైఫ్	:	వెంకటేశ్వర
హనుమాన్	:	శ్రీసత్య
టిల్లు స్క్వేర్	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 4,906 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,770	4,370
మొదటి రకం	3,560	4,000
రెండో రకం	3,390	3,780
మూడోరకం	3,270	3,480

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 22 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదింవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 395 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 352 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నడిరోడ్డున..

అసలే వృద్ధులు, వికలాంగులు.. ఆపై మండుటెండలు. ఇన్నాళ్లూ కడుపులో కాసిన్ని టీ చుక్కలు పడకముందే ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు పింఛన్లిచ్చేవారు. విపక్షాల క్షుద్ర రాజకీయాలతో వలంటీర్ల సేవలు అభాగ్యులకు అందని పరిస్థితి. దీంతో లబ్ధిదారుల బాధలు వర్ణనాతీతం. ఈ పాపం ఊరకనే పోదు.. దీనికి కారణమైన చంద్రబాబు, ఆయన తొత్తులకు మా ఉసురు తగలక తప్పదు. గత పాలన నెత్తుటి నిట్టూర్పులు గుర్తు చేశారుగా.. ఇక ఓటుతోనే వారిని పాతిపెడతామంటూ పింఛన్‌దారులు ఉద్ఘాటిస్తున్నారు.

గడప దాటని బతుకులు

- వలంటీర్లూ.. మీకు వేనవేల దండాలు
- మీరు లేని లోటు తెలిసొచ్చింది
- ఈ క్షుద్ర పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్తాం
- విపక్షాల తీరుపై మండిపడుతున్న పింఛన్‌దారులు



కశింకోటలోని 3వ సచివాలయం వద్ద పింఛన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు



కశింకోట పంచాయతీలో పింఛన్ కోసం క్యూలైన్లలో లబ్ధిదారులు

అనకాపల్లి/తుమ్మపాల/కశింకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పింఛన్‌దారులు గడప దాటాల్సిన పనిలేకుండా.. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా ఇంటికే వలంటీర్లు వచ్చి పింఛన్ సొమ్ము చేతికొచ్చేవారు. గత 58 మాసాలుగా పింఛన్ లబ్ధిదారులకు కష్టం విలువ తెలియకుండా జగన్ ప్రభుత్వం బాసటగా నిలిచింది. తాజాగా విపక్షాల రాజకీయ కుట్రలకు వలంటీర్ సేవలు ఆగిపోయాయి. దీంతో వయసు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, డయాలసిస్ రోగులు, మంచానికే పరిమితమైన వారు న్నిపడి పింఛన్ తీసుకునే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నాటి కష్టాలు గుర్తు చేశారు

చంద్రబాబునాయుడు పాలనలో పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో కొత్త పింఛన్ లబ్ధిదారులు మినహా మిగిలిన వారెవరూ మర్చిపోలేదు. పింఛన్ అర్హత పొందాలంటే జన్మభూమి కమిటీలు ఎన్ని తిప్పలు పెట్టాయో కూడా గుర్తే. ఆ కష్టం తెలుసుకున్న జగన్ తను సీఎం అయ్యాక వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. తాజాగా ఎన్నికల సంఘానికి విపక్ష టీడీపీ అనుయాయుల ఫిర్యాదుతో వలంటీర్ల సేవల్ని నిలిపేశారు. దీంతో పింఛన్ల పంపిణీ కష్టాలు మొదలయ్యాయి. సచివాలయాల వద్ద పింఛన్‌దారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. గత టీడీపీ పాలనలో తాము పడ్డ కష్టాలను మళ్లీ అదే చంద్రబాబు గుర్తు చేస్తున్నారని లబ్ధిదారులు మండిపడుతున్నారు.

3 రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తికి చర్యలు

పింఛన్ లబ్ధిదారులను ఇబ్బంది పెట్టాలన్న విపక్షాల కుట్రలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. ఈ నెల 6వ తేదీలోగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు అవసరమైన నిధుల్ని సంబంధిత అధికారులకు చేరవేసింది. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అనకాపల్లి పట్టణంలోని 26 సచివాలయాలు, మండలంలోని 27 సచివాలయాల పరిధిలో రాత్రి 7 గంటల వరకు సచివాలయాలయ సిబ్బంది అందుబాటులో ఉండి, పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. సచివాలయ కేంద్రం వద్ద పింఛన్‌దారులు ఇబ్బంది పడకుండా టెంట్‌లు, కుర్చీలు ఏర్పాటు చేశారు. మంచాన పడివున్న, నడవలేని స్థితిలో వారికి సచివాలయం వీఆర్వోలు, అడ్మిన్లు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు అందిస్తున్నారు.



కశింకోటలో పింఛన్ కోసం నిరీక్షించలేక ఇంటిదారి పట్టిన దివ్యాంగుడు దూలి తాతలు

- కశింకోట మండలంలో వితంతు, వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు కలిసి 10,665 ఉన్నాయి. బ్యాంకు నుంచి పింఛన్ల నగదు డ్రా చేయడంలో జాప్యం నెలకొనడంతో సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ చేశారు. ఇప్పటికే కొందరికి పింఛన్లు అందించారు. మిగిలిన వారికి అధికారుల ఆదేశాల మేరకు రెండు రోజుల్లో పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు సిబ్బంది చెప్తున్నారు.



అనకాపల్లిలోని 7వ సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీలో సిబ్బంది



పింఛన్ నగదు అందిస్తున్న సచివాలయ సిబ్బంది



పింఛన్‌దారుల నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న సచివాలయ సిబ్బంది



చీకటిలోనూ పింఛన్ల కోసం లబ్ధిదారుల నిరీక్షణ

చంద్రబాబు వల్లే ఈ కష్టాలు



రెండు రోజులుగా పింఛన్ రాక బాధపడ్డాను. వలంటీర్ కష్టాలు ఇప్పుడు తెలిసొచ్చాయి. ప్రతీ నెల ఇంటికే పింఛన్ డబ్బులు తెచ్చి ఇవ్వడంతో కష్టం అనిపించేది కాదు. సచివాలయం వద్ద టెంటులు, కుర్చీలు వేసి ప్రభుత్వం బాగానే ఏర్పాట్లు చేసింది. ప్రతి నెలా ఇలా రావాలంటే ఇబ్బందే. ఇప్పటికే ఎండ ఎక్కువగా ఉంది. ఈ రెండు మూడు నెలలు ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది. చంద్రబాబునాయుడు వల్ల ఇన్ని కష్టాలు పడాలని భగవంతుడు రాశాడేమో అనుకుంటున్నా.

– వి.వెంకటరాజు, దివ్యాంగుడు, అనకాపల్లి

రెండుసార్లు తిరగాల్సి వచ్చింది



గత నాలుగున్నరేళ్లుగా ఇంటి వద్దే గ్రామ వలంటీర్ల ద్వారా శ్రమ లేకుండా పింఛన్ అందుకున్నా. ఇపుడు వలంటీర్ల ద్వారా పంపిణీ చేసే అవకాశం లేకుండా చేశారు. దీంతో రూ.10 చెల్లించి మా ఇంటి నుంచి సచివాలయానికి ఆటోలో వచ్చా. ఉదయం వచ్చి చూస్తే బ్యాంకు నుంచి నగదు రాకపోవడంతో మధ్యాహ్నం రావాలని చెప్పారు. మధ్యాహ్నం కూడా క్యూలో చాలా సమయంలో నిరీక్షించి పింఛన్ సొమ్ము తీసుకున్నా. మాలాంటి వృద్ధులు సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ అందించాలి.

– కరగాని అప్పలనరస, వేణుగోపాలస్వామి ఆలయం దరి, కశింకోట

ఈ రోజు కూలి డబ్బులు పోయాయి



నాకు ఓ కన్ను పూర్తిగా కనబడదు. కుటుంబం గడవడానికి రిక్షా నడుతాను. ప్రతి నెలా దివ్యాంగుల పింఛన్ వస్తోంది. గతంలో ఇంటికే వలంటీరు వచ్చి పింఛన్ సొమ్ము లెక్కగట్టి ఇచ్చేవారు. ఇపుడు ఎలక్షన్లని, వలంటీర్ల మీద కేసులు పెట్టారని చెప్తున్నారు. పింఛన్ అందుకోవడానికి ఇపుడు సచివాలయానికి రావాల్సి వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడే అయిపోయింది. రిక్షా నడుపుతూ కూలి డబ్బులు తెచ్చుకునే అవకాశం లేకపోయింది. వలంటీర్లు పింఛన్లివ్వడమే సౌకర్యంగా ఉండేది. ఇపుడు వలంటీర్లు మా ఇంటికొస్తే ఈ ప్రతిపక్షాలకు వచ్చిన నష్టమేంటో మరి.

– బాలిబోయిన అప్పారావు, గోవిందరావు కాలనీ, కశింకోట

ఎక్కడిస్తారో తెలీక తికమక పడ్డా



పింఛన్ సొమ్ము ఎక్కడ ఇస్తున్నారో ముందుగా తెలీలేదు. దీంతో సచివాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చింది. పంచాయతీ కార్యాలయానికి వస్తే ఎవరి సచివాలయం పరిధిలోని వారికి, ఆ సచివాలయంలోనే పింఛన్ ఇస్తారని సిబ్బంది చెప్పారు. దీంతో మా సచివాలయానికి వెళ్లి చాలాసేపు నిరీక్షించి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. గతంలో వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేక ఇబ్బందులు పడి మరీ సచివాలయానికి రావాల్సి వస్తోంది.

–కొత్తపల్లి లక్ష్మి, గవరపేట, కశింకోట

ప్రకృతి వ్యవసాయంతో భూములు సారవంతం



వెదురుపర్తిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కశింకోట: ప్రకృతి వ్యవసాయంలో భూముల్ని సారవంతంగా మార్చవచ్చని భూసార పరీక్ష శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు అన్నారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో బీసీటీ, కృషి విజ్ఞాన కేంద్రంల ఆధ్వర్యంలో రైతులకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ భూములు నిస్సారంగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో భూములను సారవంతం చేసేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి ఎరువులు, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి మందుల తయారీపై రైతులకు అవగాహన కలిగించారు. వీటి వాడకం వల్ల భూమిని ఆరోగ్యవంతంగా మార్చడమే కాకుండా, అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శనివాడ అరుణ, వీఏవో వీఎల్ సింధూజ, రైతు క్లబ్ కన్వీనర్ ముక్కా పాండురంగ, కో కన్వీనర్ వెలుగుల ఈశ్వరుడు, బీసీటీ సామాజిక కార్యకర్తలు పీఏ నాయుడు, ఎ.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ దీక్షలు



కశింకోటలోని నూరి మసీదులో రంజాన్ మాస ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

కశింకోట: మండలంలోని ముస్లింలు పవిత్ర రంజాన్ మాస దీక్షలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్థానిక పురాతన జామియా మసీదు, నూరి మసీదుల్లో రోజూ చేసే ప్రార్థనలతోపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. దీక్షలు పురస్కరించుకుని వేకువజాము నుంచి సాయంత్రం వరకు కఠోర ఉపవాస దీక్ష జరిపి సాయంత్రం దీక్ష విరమిస్తున్నారు. ఈ సందర్భంగా సామూహికంగా ఇఫ్తార్ విందు చేస్తున్నారు. మండల గ్రామాల నుంచి ముస్లింలు దీక్షలు, ఇఫ్తార్ విందుల్లో పెద్దలతోపాటు పిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

సీనియర్ సిటిజన్లకు ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సత్యవతి

అనకాపల్లి: పట్టణంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశాన్ని సంఘ అధ్యక్షుడు గౌరీపతి మాస్టర్ అధ్యక్షతన స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి నేత్రాలయం రాజమండ్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ సత్యవతి, ఐ క్యాంప్ కోఆర్డినేటర్ బి.కమలేష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్ అవసరమైన వారికి సాయం చేసేందుకు తమ సంఘం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం 15 మంది అసోసియేషన్ సభ్యులకు జన్మదిన వేడుకలను జరిపి, కేక్ కట్ చేయించారు. సమావేశంలో ఎంబీవీ స్వామి, కె.లక్ష్మణరావు, మల్ల చంద్రశేఖర్, వీరభద్రరావు, నల్లల దేవుళ్ల పాల్గొన్నారు.

గుర్రాజుపేటలో నేడు నూకాంబిక ఆలయ ప్రతిష్ట



శాంతి హోమంలో పాల్గొన్న భక్తులు

ఎస్.రాయవరం : గుర్రాజుపేటలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రతిష్టా మహోత్సవం, ఆలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. గ్రామస్తులు విరాళాలు సుమారు రూ.20 లక్షలకు పైగా సమకూర్చి ఆలయ నిర్మాణం చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం శాంతి హోమం నిర్వహించారు. మంటపార్చన, దేవతా వాహనం, క్షీరాధివాసం, జలాధివాసం, సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ప్రాకార సంస్కార అమ్మవారి ప్రతిష్టా మహోత్సవం, బలిహరణం, పూర్ణాహుతి, చతుర్వేద స్వస్తి దీక్షా విరమణ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పేదల పక్షపాతి జగన్‌కు మద్దతుగా నిలవండి



గొల్లపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



మంచంపై ఉన్న వృద్ధురాలిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మలసాల భరత్‌కుమార్



గోకివానిపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత

- ఎన్నికల ప్రచారంలో ఓటర్లతో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్
- గడప గడపకు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న మలసాల

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రజల దీవెనలతో రెండు మాసాల్లో జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ గొల్లపేటలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన నిలిచిన ప్రభుత్వానికి, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగించిన జగనన్నకు అండగా నిలవాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు.

- పట్టణ పరిధి 80వ వార్డులో కార్పొరేటర్ కొణతాల నీలిమభాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్ సతీమణి నివేదిత గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తన భర్తను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు.

కశింకోట: మండలంలోని మోసయ్యపేట శివారు గోకివానిపాలెంలో వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సతీమణి నివేదిత బుధవారం గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన భర్త భరత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఆమె వెంట పార్టీ నాయకులు గోకివాడ గోవింద, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపంతోనే వలంటీర్ల రాజీనామా

తుమ్మపాల: మండలంలో చింతనిప్పుల అగ్రహారం గ్రామానికి చెందిన కొల్లిమళ్ల మాలతి వలంటీర్ పోస్టుకు రాజీనామా చేసింది. ఈ మేరకు సచివాలయం వద్ద పంచాయతీ కార్యదర్శికి బుధవారం రాజీనామా పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ కార్యక్రమాలను, సేవలను ప్రజల్లోకి నిబద్ధతతో తీసుకెళ్లామని, కరోనా కష్టకాలంలో కూడా క్లస్టర్‌లో సేవలు అందించామన్నారు. ఇప్పుడు ఎన్నికల పేరిట తమను ప్రజల నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇంత మేలు చేసిన జగనన్న గెలుపు కోసం ఇక నుంచి స్వేచ్ఛగా తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు.

116 మంది వలంటీర్ల రాజీనామా

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నాటికి 116 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారిక సమాచారం. కశింకోటతోపాటు బయ్యవరం, ఉగ్గినపాలెం గ్రామాలకు చెందిన వలంటీర్లు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా వెదురుపర్తికి చెందిన 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. టీడీపీ నాయకులు తమ సేవలకు అడ్డంకులు కల్పిస్తున్నందుకు మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు తెలిపారు.



వలంటీర్‌గా రాజీనామా చేస్తున్న కొల్లిమళ్ల మాలతి

15 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: మండలంలోని కొత్తపల్లిలో చిల్లర దుకాణంలో విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్న 15 మద్యం సీసాలను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వినోద్‌బాబు తెలిపారు. ఈ మేరకు దుకాణ నిర్వాహకుడు ఎస్.సూరిబాబును అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ రాట

మునగపాక : మునగపాకలోని పల్లపు వీధి సాంబశివుని ఆలయం వద్ద బుధవారం భక్తి శ్రద్ధలతో కల్యాణ రాట మహోత్సవం నిర్వహించారు. ఈ నెల 5న ఆలయ వార్షికోత్సవంలో భాగంగా పార్వతీ-పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపా రు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అదే రోజు సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించి రాత్రి 8 గంటలకు కల్యాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు మావూరి కాశీ, పెద్దలు ఆలంక ప్రకాశరావు, కుంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

టిప్పర్ లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు



తాళ్లపాలెం కూడలి వద్ద ఢీకొని దెబ్బతిన్న టిప్పర్ లారీలు

కశింకోట:మండలంలోని తాళ్లపాలెం కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు. అనకాపల్లి నుంచి యలమంచిలి మీదుగా మాకవరపాలెం మండలం ఆన్‌రాక్ పరిశ్రమకు టిప్పర్ లారీ వెళ్తోంది. తాళ్లపాలెం కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా, యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న మరో టిప్పర్ లారీ ఢీకొంది. దీంతో రెండు వాహనాలూ దెబ్బతిన్నాయి. ఒక డ్రైవర్ స్వల్పంగా గాయపడినట్లు సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.